epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 01 | సంచిక : 163 | శుక్రవారం | 22.11.2024

## తల్లి కళ్ల ముందే.. టైరు కింద

# నలిగిపోయిండు


(ఫైల్)

- స్కూల్ బస్సు కింద పడి బాలుడి మృతి
- రతిరామ్ తండాలో విషాదం
- డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం

**అమ్మా.. అక్కతో నేనూ స్కూల్‌కు వెళ్తా.. అంటూ.. నిత్యం మారం చేసే కొడుకు ఆ అక్క వెళ్లే బస్సు కింద పడి నలిగిపోతుంటే ఆ తల్లి తల్లడిల్లిపోయింది. వారం కింద ఎంతో సంతోషంగా పుట్టిన రోజు జరుపుకున్న తన కన్నయ్యకు అప్పడే నూరేళ్లు నిండిపోయాయా.. అంటూ.. గుండెలు పలిగిలేలా ఆ మాతృమూర్తి రోదించిన తీరు అందరినీ కలచివేసింది.**

**కొడకండ్ల, మన చౌరాస్తా :**

ప్రైవేటు స్కూల్ బస్సు కింద పడి బాలుడు మృతి చెందిన విషాద సంఘటన గురువారం జనగామ జిల్లా కొడకండ్ల మండలం చెరువు ముందు తండా గ్రామపంచాయతీ శివారులోని రత్తిరం తండాలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రతిరామ్ తండాకు చెందిన వాంకుడోత్ రమేష్ , పరమేశ్వరి దంపతులకు కుమార్తె శాన్విక, కుమారుడు శ్రీహాన్ (2) ఉన్నారు. కుమార్తె దేవరుప్పుల మండలం కేంద్రంలోని బాల యేసు ప్రైవేటు పాఠశాలలో నర్సరీ చదువుతోంది. పాఠశాలకు చెందిన బస్సులో నిత్యం వెళ్లి వస్తు చదువుకుంటుంది. ఈ క్రమంలో పరమేశ్వరి తన కుమార్తె శాన్వికను బస్సు ఎక్కించి పంపించే క్రమంలో కుమారుడు శ్రీహాన్ (2) ముందుండగా డ్రైవర్ చూసుకోకుండా బస్సును నడపడంతో ముందు టైర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్కూల్ బస్సు డ్రైవర్ అజాగ్రత్తగా చూసుకోకుండా బస్సు నడపడం వల్లే తమ కొడుకు దూరమయ్యాడని తల్లిదండ్రులు కన్నీరు మున్నేరుగా విలపించారు. తండ్రి రమేష్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చింతరాజు తెలిపారు.



# రిసెప్షన్‌కు వెళ్తూ.. మృత్యు ఒడిలోకి

- రోడ్డు ప్రమాదంలో భర్త మృతి
- భార్యకు తీవ్ర గాయాలు

**కొడకండ్ల, మన చౌరాస్తా :** మరో 10 నిమిషాల్లో ఫంక్షన్ హాలుకు వెళ్లి బంధువులతో ఆనందంగా గడపాల్సిన దంపతులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో భర్త మృతి చెందగా భార్యకు తీవ్ర గాయాలయ్యారు. కొడకండ్ల మండలం మైదం చెరువు తండా గ్రామపంచాయతీ పరిధిలో జరిగిన ఈ ఘటన వివరాలు స్థానికుల కథనం ప్రకారం.. సూర్యా పే ట జిల్లా తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామానికి చెందిన వనమాల వెంకన్న, వాణి దంపతులు తిరుమలగిరి మండల కేంద్రంలోని తమ బంధువుల వివాహ రిసెప్షన్ వేడుకకు వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి బయలుదేరారు. మార్గమధ్యలో జనగామ సూర్యాపేట రహదారిపై మైదం చెరువు తండా శివారులో రోడ్డుపై ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో వనమాల వెంకన్న (38) అక్కడికక్కడే మృతి చెందగా అతడి భార్య వాణికి తీవ్ర గాయాలై సీరియస్ గా ఉండడంతో ఆమెను తిరుమలగిరి ఆసుపత్రికి తరలించారు. మృతుడు వెంకన్న లారీ డ్రైవర్ గా పనిచేస్తుండగా ఇద్దరు కుమారులు ఉన్నారు.


మృతుడు వెంకన్న (ఫైల్)


గాయాలైన వాణి (ఫైల్)



2

## జనగామలో 99 శాతం

## సర్వే పూర్తయ్యింది

- అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్



3

## జిల్లాలో బెల్ట్ షాపులను

## నివారించాలి

- సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన



4

## రైతుల కళ్లలో

## ఆనందమే లక్ష్యం

- ఏఎంసీ చైర్మన్ శివరాజ్ యాదవ్

# జిల్లాలో 99శాతం సర్వే పూర్తి

- **అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్**



**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లాలో 99 శాతం సమగ్ర ఇంటింటి సర్వే పూర్తి అయినట్లు అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన కలెక్టరేట్ లో మీడియాతో మాట్లాడుతూ.. జనగామ జిల్లాలో ఇంకా సర్వే చేయించుకొని వారు తప్పని సరిగా సర్వే చేయించుకోవాలన్నారు. సమగ్ర ఇంటింటి సర్వే వివరాలు ఇవ్వని వారు గ్రామాల్లోని ప్రజలు పంచాయతీ సెక్రెటరీ ని సంప్రదించాలని, పట్టణ ప్రజలు మున్సిపాలిటీ వార్డ్ ఆఫీసర్ ను సంప్రదించి సహకరించాలన్నారు. ఒకటి రెండు రోజులలో సర్వే చేయించుకోవాలన్నారు. ఇది ప్రతి ఒక్కరూ గమనించి ఒక మంచి సదవకాశంగా భావించాలన్నారు.



# సేవాభావంతో ముందుకు సాగాలి

## బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**బోథ్, మన చౌరాస్తా :** వైద్యులు నారాయణుడితో సమానమని, ఆసుపత్రులు సామాజికంగా సేవాభావంతో ముందుకు సాగాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం బోథ్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన లక్ష్మీ చైత్ర హాస్పిటల్ ను ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో విద్య, వైద్యం మౌలిక అవసరాలని, అవి ప్రజా జీవితంలో పెద్ద మొత్తంలో ప్రభావం చూపుతాయని అన్నారు. నూతనంగా ప్రారంభించబడుతున్న ఆసుపత్రి ఈ ప్రాంతంలో మంచి సేవలు అందించి, ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ను ఆసుపత్రి వైద్యులు శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్ర నేలలను కలిసిన సంఘ నాయకులు

**బోథ్, మన చౌరాస్తా :** తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు వల్లకాటి రాజ్ కుమార్ ను స్థానిక పద్మశాలి సంఘ నాయకులు గురూవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా త్వరలో జరిగే అదిలాబాద్ జిల్లా పద్మశాలి సంఘం ఎన్నికల గురించి చర్చించినట్లు వారు తెలిపారు. పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు మేరుగు భోజన్న, గౌరవ అధ్యక్షుడు గంగుల మల్లేష్, ఆలయ కమిటీ కోశాధికారి కటకం నగేష్, కార్యవర్గ సభ్యుడు తడక పోశెట్టి, అదిలాబాద్ సంజయ్ నగర్ వార్డు పద్మశాలి సంఘం అధ్యక్షుడు తాళ్ల రవీందర్ కలిసిన వారిలో ఉన్నారు





## కేజీకేఎస్ సదస్సుకు బబ్బూరికి ఆహ్వానం

**దేవరుప్పుల, మన చౌరాస్తా :** ఈనెల 30న జనగామ జిల్లా కేంద్రంలో కేజీ కేఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కల్లుగీత కార్మిక సంఘం పదేండ్ల ప్రయాణం పేరుతో నిర్వహిస్తున్న జిల్లా సదస్సుకు గౌడ సంఘం రాష్ట్ర నాయకులు, బీఆర్ఎస్ నాయకులు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్‌ను ఆహ్వానించారు. ఈ మేరకు గురువారం కేజీకేఎస్ జిల్లా అధ్యక్షుడు కుర్ర ఉప్పలయ్య గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్దే వెంకటమల్లయ్య గౌడ్ హైదరాబాద్ లోని శ్రీకాంత్ నివాసంలో ఆయనను కలిసి జిల్లా సదస్సుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ గౌడ్ వారి ఆహ్వానం మేరకు పాల్గొంటానని తెలిపారు.ఈ సభకు జిల్లా నలు మూలల నుంచి గౌడ కులస్థులు, గీత కార్మికులు, శ్రేయోభిలాషులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలి

**జనగామ, మన చౌరాస్తా :** ఈ నెల 23, 24వ తేదీల్లో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం 2025 క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా పేర్కొన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని అర్హులైన జిల్లా ప్రజలందరూ వినియోగించుకోవాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటికే 18 సంవత్సరాలు నిండిన వారు (లేదా) 01 జనవరి 2025 నాటికి 18 సంవత్సరాలు నిండబోయే వారు ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హులన్నారు. అందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. ఫారం 6 కొత్త ఓటరుగా నమోదు చేసుకోవడానికి, ఫారం 7 జాబితాలో అభ్యంతరాలు తెలపడానికి, ఫారం 8 ఓటరు వివరాల్లో ఇంటి చిరునామా మార్పు, కొత్త ఎపిక్ కార్డు, దివ్యాంగులుగా గుర్తింపు మొదలైనవి సరవణ చేసుకోవచ్చన్నారు. ఈ నెల 23, 24వ తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బూత్ స్థాయి అధికారులు (బీఎల్వోలు) ఆయా పోలింగ్ బూత్ ల వద్ద అందుబాటులో ఉంటారని, ఓటరు వివరాలను సరిచేసుకోవడం (లేదా) కొత్త ఓటరుగా నమోదుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. voters.eci.gov.in వెబ్ సైట్ ద్వారా (లేదా) Voter Helpline మొబైల్ యాప్ ద్వారా కూడా ఓటరుగా సులభంగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.



## బీసీల సంక్షేమానికి కృషి చేయాలి

**జనగామ, మన చౌరాస్తా :** ఆర్థికంగా.. సామాజికంగా.. రాజకీయంగా వెనుకబడి ఉన్న బీసీలను బలోపేతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జనగాం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిర్ర వీరస్వామి కోరారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ వెనుకబడిన తరగతుల డెడికేటెడ్ కమిషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల వారిగా కల్పించాల్సిన రిజర్వేషన్ దామాషా ఖరారు చేసే అంశంపై బహిరంగ విచారణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీరస్వామి పాల్గొని డెడికేట్ కమిషన్ బృందానికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘం జనగామ జిల్లా ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కుల గణన చేసి బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. విద్య వైద్యం ఉద్యోగ పరంగా బీసీలకు తగిన న్యాయం జరగాలని, బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేసి వారి అభివృద్ధికి కృషి చేయాలని, ఎస్సీ, ఎస్టీ చట్టం లాగా బీసీలకు భద్రత చట్టం తేవాలని కోరారు. బీసీలకు చట్టసభలో 50 శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు.

## నల్ల పోచమ్మ ఆలయానికి నీటి వసతికి ఎస్టిమేషన్లు

**చేర్యాల, మన చౌరాస్తా :** చేర్యాల మండలంలోని నాగపూరి గ్రామంలో శ్రీనల్ల పోచమ్మ దేవాలయం పరిధిలో దుకాణాల సముదాయానికి, దేవాలయానికి భగీరథ నీటిని అందించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఆలయాని నీటి వసతి కల్పించాలని కొమ్మూరి ప్రతాపరెడ్డి కోరగా దేవస్థానం చైర్మన్ గూడెం మహేష్ ఆధ్వర్యంలో అధికారులు డీఈ కృష్ణ, ఏఈ దివ్య, పంచాయతీ కార్యదర్శి రాజు వాటర్ సప్లైపై గురువారం పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలో ఓ హెచ్ ఆర్ ట్యాంక్ నిర్మాణానికి ఎస్టిమేషన్లు తయారు చేశారు.

Local News




# జిల్లాలో బెల్ట్ షాపులను నివారించాలి

**జనగామ, మన చౌరాస్తా :** జిల్లాలో విచ్చలవిడిగా కొనసాగుతున్న బెల్ట్ షాపులను మూసివేసి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడలని సీఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జనగామ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం జనగామ తహసీల్దార్ కార్యాలయం నుంచి జనగామ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయం వరకు మద్య మహమ్మారి భూతం వేషాధారణతో ర్యాలీ నిర్వహించి అనంతరం కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఇర్రి అహల్య అధ్యక్షత వహించగా సీపీఎం జిల్లా కార్యదర్శి మొకు కనకా రెడ్డి, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికల వాగ్దానాల్లో బెల్ట్ షాపులను నిషేధించి ప్రజలను రక్షిస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ అది తెలంగాణ రాష్ట్రంలో అమలు కావడం లేదన్నారు. ముఖ్యంగా జనగామ జిల్లాలో లిక్కర్ వ్యాపారులు సిండికేట్ గా ఏర్పడి బెల్ట్ షాపుల ద్వారా జిల్లాలో మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని ఆరోపించారు. బెల్ట్ షాపుల నిర్వాహకులకు ఎమ్మార్పీ ధర కన్నా ఎక్కువ ధరకు మద్యాన్ని అమ్ముతూ ప్రజలను ఆర్థికంగా దోచుకుంటున్నారన్నారు. బెల్ట్ షాపులను నిరోధించాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రెవెన్యూ, పోలీస్, ఎక్సైజ్ శాఖలను సమన్వయం చేస్తూ టాస్ట్ ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేసి విస్తృతమైన తనిఖీలు నిర్వహించి బెల్ట్ షాపులను అరికట్టాలని కోరారు. లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా దశల వారి ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, రాపర్తి సోమయ్య, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, జోగు ప్రకాష్ సుంచు విజేందర్, పోతుకనూరి ఉపేందర్, చందు నాయక్, బోడ నరేందర్, ఎండి షబానా, మునిగేల రమేష్, కోడెపాక యాకయ్య, ఎండి అజార్, మండల కార్యదర్శి గంగాపురం మహేందర్, గుండబోయిన రాజు, నాయకులు తూడి దేవదానం, కళ్యాణ లింగం, బాల్నే వెంకట మల్లయ్య, పందిళ్ళ కళ్యాణి, పల్లెర్ల లలిత, ఇంజ ఎల్లయ్య, బొట్ల శ్రావణ్, పాము శ్రీకాంత్, గోసంగి శంకరయ్య, తాండ్ర ఆనందం, ధర్మ బిక్షం, సుమ, ఇంజ ఎల్లయ్య, కనకచారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# మూఢ విశ్వాసాలను పారద్రోలాలి

## జేవీవీ ఆధ్వర్యంలో చెకుముఖి పోటీలు

**జనగామ, మన చౌరాస్తా :** సమాజ పురోభివృద్ధికి ఆటంకంగా మారిన మూఢవిశ్వాసాలను పారద్రోలడంలో జనవిజ్ఞాన వేదిక కృషి అభినందనీయమని మండల విద్యాధికారి రాజేందర్, డాక్టర్ వంశీ అన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన జనగామ చెకుముకి మండల స్థాయి పోటీలు మండల కన్వీనర్ మర్రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎంఈవో రాజేందర్, డాక్టర్ వంశీ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఒక వైపున పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కూడా మూఢనమ్మకాల కోసం ప్రచార జాతాలను నిర్వహిస్తున్నారని, జనవిజ్ఞాన వేదిక లాంటి సంస్థలు కూడా విశేషంగా కృషి చేస్తున్నాయన్నారు. పిల్లల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంచేందుకు ఇలాంటి చెకుముకి పరీక్షలు ఉపకరిస్తాయన్నారు. నేర్చుకున్న జ్ఞానాన్ని నిజ జీవితంలో అమలు చేయాలని, విద్యార్థి దశ నుంచే సైన్స్ పట్ల మక్కువ కలిగివుండాలన్నారు. జేవీవీ మండల కన్వీనర్ మర్రెడ్డి మాట్లాడుతూ పాఠశాల స్థాయి పరీక్షలను



మండలంలోని 27 పాఠశాలల్లో నిర్వహించామని, హాజరైన విద్యార్థులను 4 టీంలుగా నవంబర్ 28న జనగామ జిల్లా కేంద్రంలో జరిగే జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారని తెలిపారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమాదేవి, యువన్ డౌగ్లుస్ స్కూల్ కరెస్పాండంట్ జాయ్ డేవిడ్, పుల్లా రెడ్డి, క్రాంతి కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నెల్లుట్లలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

**లింగాలఘణపురం, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కేంద్రానికి సమీపంలోని నెల్లూట్ల చెరువు కెనాల్ లో గురువారం ఒక గుర్తు తెలియని మృత దేహం లభించినట్టు జనగామ పోలీసులు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు వెళ్లిగా.. సుమారు 25 నుంచి 30 లోపు సంవత్సరాల వయస్సు ఉన్న వ్యక్తి చనిపోయి ఉన్నాడని, మృతుడు నలుపు రంగు షర్టు, గోధుమ రంగు ప్యాంట్, నలుపు రంగు బెల్ట్ ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఆ మృతదేహాన్ని జనగామ జిల్లా హాస్పిటల్ మార్చురీలో భద్రపరిచనట్టు పోలీసులు పేర్కొన్నారు. ఎవరైనా వివరాలు తెలిస్తే ఎస్హెచ్వో 8712685202, ఎస్సై 8712685259, 8712685260, పోలీస్ స్టేషన్ 8712685032 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.



# శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించాలి

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** సమాజ పురోభివృద్ధికి ఆటంకంగా మారిన మూఢవిశ్వాసాలపై చైత్యనం చేస్తూ.. విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించాలని బచ్చన్నపేట ఎంఈవో వెంకట్ రెడ్డి, డాక్టర్ సృజన అన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బచ్చన్నపేట చెకుముకి మండల స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ నరసింహా రావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. దేశం అభివృద్ధి చెందాలంటే సైన్స్ లో అభివృద్ధి సాధించాలని, మూఢ విశ్వాసాలు సమాజాన్ని ముందుకు వెళ్లకుండా అడ్డుకుంటున్నాయని, జనవిజ్ఞాన వేదిక లాంటి సంస్థలు ముఢనమ్మకాలను రూపుమాపేందుకు విశేషంగా కృషిచేస్తున్నాయన్నారు. పిల్లలు విద్యార్థి దశ నుంచే సైన్స్ పట్ల మక్కువ కలిగి ఉండాలన్నారు. జేవీవీ మండల కన్వీనర్ నరసింహా రావు మాట్లాడుతూ పాఠశాల స్థాయి పరీక్షలను మండలంలోని 15 పాఠశాలల్లో ఈ పోటీలు నిర్వహించామని, ఇందులో నుంచి 3 టీంలు నవంబర్ 28న జనగామ జిల్లా కేంద్రంలో జరిగే జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# సంకల్ప దీక్ష కరపత్రాల ఆవిష్కరణ

**చేర్యాల, మన చౌరాస్తా :** ప్రభుత్వం దృష్టి చేర్యాల వైపు మళ్లించడానికే ప్రజాసంకల్ప దీక్ష నిర్వహిస్తున్నట్లు జేఏసీ చైర్మన్ డాక్టర్ పరమేశ్వర్ తెలిపారు. గురువారం చేర్యాల మండల కేంద్రంలోని జేఏసీ కార్యాలయంలో నవంబర్ 30న నిర్వహించే సంకల్ప దీక్ష కరపత్రాలను జేఏసీ నాయకులతో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ మాట్లాడుతూ దశాబ్దాల తరబడి చేర్యాలకు ఘనమైన చరిత్ర ఉన్నదని గత కొంత కాలం నుండి అనేక ఒడిదుడుకులను ఎదురుకోవడం కారణంగా బలమైన స్థానిక నాయకత్వం లేకపోవడం వల్ల ఈరోజు చేర్యాల ప్రాంత అస్తిత్వానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఈ ప్రాంత బిడ్డలుగా ఈ ప్రాంతానికి పూర్వ వైభవం తీసుకురావడానికి అన్ని రాజకీయ పార్టీలను ఏకం చేసి ఒకే ఎజెండాపై తీసుకువచ్చామన్నారు. రెవిన్యూ డివిజన్ సాధించి రానున్న రోజుల్లో 2026 లోపు డీలిమిటేషన్ లో అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఏర్పాటు చేసుకునే విధంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ క్రమంలో 30న నిర్వహించే ప్రజా సంకల్ప దీక్షకు అన్ని వర్గాల ప్రజలు ఈ ప్రాంతం మేధావులు, కుల సంఘాలు అందరూ సహకరించి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఆగం రెడ్డి, అంకుగారి శశిధర్ రెడ్డి, గిరి కొండల్ రెడ్డి, చెరుకు రమణారెడ్డి, బాలరాజు, కమలాకర్, పుర్మ సంజీవరెడ్డి, తోకల ఉమారాణి, తడక లింగమూర్తి, తాళ్లపల్లి రమేష్, ఔషర్ల యాదయ్య, ఉమా సురేష్ రెడ్డి, ఈరి భూమయ్య, సాయిలు, జహీరుద్దీన్, అంబటి అంజయ్య, కరెడ్ల రఘుపతి రెడ్డి, గూడ రాజిరెడ్డి, ఆరుట్ల వినీత్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల కళ్లలో ఆనందమే కాంగ్రెస్ లక్ష్యం

### ఏఎంసీ చైర్మన్ శివరాజ్‌యాదవ్



**జనగామ, మన చౌరాస్తా :** రైతుల కళ్లలో ఆనందం చూడడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తున్నదని జనగామ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ అన్నారు. జనగామ వ్యవసాయ మార్కెట్ యార్డుకు గురువారం 115 మంది రైతులు వడ్లు తీసుకురాగా ప్రైవేటు కోనుగోలు, మద్దతు ధర కంటే ఎక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసినట్టు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జ మార్కెట్ లో ఈ సిజన్ లో రికార్డు స్థాయిలో మద్దతు ధర ఇచ్చి వరి ధాన్యం కొనుగోలు చేసినట్టు పేర్కొన్నారు. ఐఆర్ 64 రకానికి అత్యధికంగా రూ.2346, ఐఆర్ ఆర్ఎన్ఆర్ రకానికి రూ. 2,351 ధర పలికినట్టు తెలిపారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు ఇప్పించి రైతుల మన్నన పొందడమే ధ్యేయంగా మార్కెట్ కమిటీ పనిచేస్తుందని శివరాజ్ పేర్కొన్నారు.

# విజయోత్సవాలకు ఉన్న నిధులు.. ఫీజు బకాయిల విడుదలకు లేవా?

### – ఏఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామగళ్ల నరేశ్

**చేర్యాల, మన చౌరాస్తా :** విద్యారంగంపై ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని.. ప్రభుత్వానికి విజయోత్సవాలు చేసుకునేందుకు నిధులు ఉంటున్నాయి.. కానీ.. విద్యారంగానికి పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించేందుకు నిధులు ఉండడం లేదని ఏఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామగళ్ల నరేశ్ విమర్శించారు. గురువారం చేర్యాల మండల కేంద్రంలో ఏఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్నిచేపట్టారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్షిప్ ల బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఫీజు బకాయిలు విడుదల కాకపోవడంతో రాష్ట్రంలో కళాశాలలు బంద్ చేసిన ప్రభుత్వం స్పందించకుండా మౌనంగా ఉంటూ విద్యార్థుల జీవితాలతో చలగాటమాడుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యారంగంపై దృష్టి పెట్టి పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఎస్ఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఆకుల శిరీష, కార్తీక్, పోతుగంటి సాయికిరణ్, రమేష్, రాజు, స్వప్న, అంజలి పాల్గొన్నారు.






## జయశంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో

# పలు సేవా కార్యక్రమాలు

**చేర్యాల, మన చౌరాస్తా :** చేర్యాల మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో జయశంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామంలో నిరుపేద వృద్ధులకు నిత్యవసర సరుకులు అందజేశారు. గ్రామ పాఠశాలలో 100 శాతం హాజరు నమోదు కలిగిన విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ.3,500 విలువ గల సైకిల్‌ను అందించారు. ద్వితీయ బహుమతిగా క్యారం బోర్డు అందించారు. జయశంకర్ ఫౌండేషన్ అధ్యక్షుడు జింకల పర్వతాలు యాదవ్ మాట్లాడుతూ గ్రామంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామని, భవిష్యత్తులో కూడా అనేక కార్యక్రమాలు చేపడతామని, పేద ప్రజలకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గర్నపల్లి చంద్రం, కార్యదర్శి అప్పల బాబు, కోశాధికారి మెడమైన కుమార్, ఫౌండేషన్ సలహాదారుడు పోరెడ్డి అనిల్, సభ్యులు జింకలమోహన్, పోలోజు రాజబాబు తదితరులు పాల్గొన్నారు.


# WANTED విలేకరులు కావలెను




'మన చౌరాస్తా' తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తి స్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'మన చౌరాస్తా' సాదర స్వాగతం పలుకుతోంది.

## సెల్ : 9676400812